# మేం మనుషులం!

టక్ .... టక్

టక్ .... టక్ .... టక్ ....

ఆ చప్పుళ్ళు నా టైపు మిషనువి. మా ఆఫీసరు రాసిన లెటర్ని టైపు చేస్తున్నాను.

నా ఐదేళ్ళ టైపు సర్వీసులో- టైపు మిషను మీద నా వేళ్ళు పడ్డాయా? కూడిపూడి, భరతనాట్యం కాళ్లు కూడా నా వేళ్ళ ముందు బలాదూర్ అని హామీ ఇవ్వగల్ను. గొప్ప అనుభవం గల రౌతు తన గుర్రాన్ని పరిగెత్తిస్తున్నంత వేగంగా టైపు చేయగల్ను.

అయితే—

ఆ రోజు నా వేళ్ళు అలసిపోయిన నర్తకి అడుగుల్లా, జబ్బుచేసిన గుర్రపు నడకలా తడబడుతున్నాయి. నా కళ్ళు మాటి మాటి కోసారి కిటికీ అవతల వేపున్న దృశ్యం చూస్తూ నన్ను సరిగా టైపు చేయ నివ్వటం లేదు.

కిటికీ అవతల వేపున్న దృశ్యం- 'ఏ' సర్టిఫికేట్ లేని తెలుగు సినిమా వాల్పోష్టరు కాదు; ఎవరొస్తున్నారో అన్న భయం లేకుండా మాటాడు కుంటున్న ప్రేమికుల జంట అసలే కాదు. అక్కడున్నది ఓ గాడిద. దాని మూతికి రెండంగులాల దూరంలో దాదాపు మూణ్ణెలల వయసున్న గాడిద

కూన, చలన రహితంగా పడి వుంది. దాని ప్రాణం గంట క్రితమో, గంటన్నర క్రితమో ఈ లోకాన్ని వదలి వెళ్ళింది.

"ప్రభువా! ఈ నీ దాసుని కరుణించి పరలోకంలో ఆశ్రయం ఇవ్వు తండ్రీ!" అంటూ శవం ముందు మోకరిల్లి ప్రార్థిస్తోన్న ఫాదరీలా ఉందా గాడిద, కళ్ళు మూసుకుని. కన్నవారూ, కట్టుకున్నవాడూ దూరమై ఒంటరిగా- చనిపోయిన బిడ్డని ఒడిలో వేసుకుని ఏడవడానికి సైతం కన్నుల్లో నీళ్ళు లేని కూలి తల్లిలా వుందా గాడిద.

"టైమెంతయింది సార్!"

"పదకొండున్నర"

"ఏమిటో నండీ! గడియారాలు మరీ బద్ధకంగా నడుస్తున్నాయ్" మా అఫీసులోని గుమాస్తాలు ఏదో వకటి మాటాడుకుంటూ పని చేసుకుంటున్నారు- గడియారంలోని గంటల ముల్లులా.

ఆ గాడిదకే మాటలొచ్చి ఉంటే.... "నా తల్లీ!— నా బంగారు తల్లీ! నా చిట్టీ, నన్ను విడిచి వెళ్ళావా అమ్మా— చూడే, చూడే.... నా వంక చూడవూ? చిట్టితల్లీ!.... బుజ్జీ.... నాబుజ్జీ.... అయ్యో— నాబిడ్డ చచ్చిపోయింది.... అమ్మా.... పాపా...." అంటూ ఎంత ఏడ్చేదో!

ఇదంతా— నా మనసుని గాడిదతో చేర్చి ఏడవటమేనా? ఆ గాడిదకి నిజంగా బాధ వుందా?.... మరయితే ఊరికే అలా కళ్లు మూసుకుందే! నేనూహించిన బాధ కంటే కోటి రెట్లు బాధ దాని గుండెల్లో గింగిర్లు కొడుతోందేమో!

ఎలాగో టైపు చేయడం అయిపోయింది. రమణరావు కాఫీకి రమ్మంటే వెళ్ళాను. అతను నా కంటే సర్వీసులో నాలుగేళ్ళు సీనియర్. ప్రస్తుతం అతను యూ.డి.సి. (అప్పర్ డివిజనల్ క్లర్క్). రమణరావుతో

నేనందాకా ఫీలవుతున్న విషయం చెప్పాను.— "గాడిద గురించి అంత ఇదవుతున్నావా! అలాంటి వన్నీ మనం సీరియస్‌గా తీసుకో నక్కర్లా" అంటూ తేలిగ్గా నవ్వుతూ కొట్టి పారేశాడు. అలాకాకుండా- అతను "అయ్యో పాపం!" అనేసుంటే నా మనసు కుదుట పడి ఉండును.

* * *

ఆ వారం రోజులూ అప్పుడప్పుడు ఆ 'గాడిద సంఘటన' జ్ఞాపకం వస్తూనే ఉండేది.

ఓ రోజు ఉదయాన్నే ఆఫీసుకి బయల్దేరాను— ఆఫీసు వర్కు ఎక్కువగా ఉండటం చేత. నేను ఆఫీసుకి వెళ్ళాలంటే గవర్నమెంటు గరల్స్ హైస్కూల్లోనుంచి వెళ్ళాలి. అలా హైస్కూల్లోనుంచి వెడుతోంటే హైస్కూలుకి కుడివేపు నున్న బావి దగ్గర గుంపుగా నిలబడి ఉన్నారు జనం. అందులో పిల్లలు మొదలుకొని ముసలాళ్ళ వరకూ ఉన్నారు.

అక్కడ జరుగుతున్న వింత ఏమిటా అని గుంపుని తోసుకుంటూ వెళ్ళి తొంగి చూశాను. షాక్ కొట్టి నట్టయింది. వాళ్ళంతా చూస్తున్నది పసి కందు శవాన్ని. కొన్ని గంటల క్రితమే పుట్టి గిట్టిన పిల్ల శవాన్ని. ఎవరో బావిలో పారేయాలని వచ్చి ఎందుకో బావి పక్కగా పారేసి వెళ్ళారు.

చిన్ని ముక్కూ... లేత పెదాలూ... ఉబ్బి ఉన్న కళ్ళు- వత్తుగా ఉన్న తల వెంట్రుకలూ... కంది పోయినట్టు ఉన్న ఎర్రటి వళ్లూ చూస్తుంటే.... ఆ పిల్ల పెద్ద అందగత్తె అయ్యేదేమో— బతికి బట్ట కట్టి ఉంటే.

'ఆ పాప చచ్చిపోలేదు. ఆ పాప అప్తులెవరో పాప ఫలమని చంపేసి ఉంటారు....' ఆ మాటలు నేనూహించినవి మాత్రమే కావు— చుట్టూ నిలబడ్డ వారి మాటలు కూడా.

ఆ తల్లి అనే దానికి బుద్ధిలేదు.... బంగారం లాంటి పిల్లని చంపు తోంటే చూస్తూ ఎలా ఊరుకుందో!" ఒక ముసలావిడ దవడలు నొక్కు కుంటూ అంది.

"అది మొగుడు చచ్చిందో— పెళ్ళికి పనికి రాకుండా పోయిందో అయి ఉంటుందిలే. లోకుల్తోపడలేక దాని తల్లిదండ్రులు ఈ పన్జేసుంటారు- ఇలా పిల్లల్ని చంపడం ఎంత దారుణం— ఎంత రాక్షసత్వం!" ఓ యువ కంఠం గొణిగింది.

"కలి కాలమండీ!"

"అవునవును"

ఇన్ని రకాలుగా అనుకుంటున్నారు. అక్కడ నిలబడ్డవారు 'మంచి పని జరిగింది.... ఇలా జరగడమే న్యాయం' అన్న తీరులో ఒక్కకంఠం పలకలేదు. ఇలాంటి దుస్థితి (మొగుడు లేకుండా బిడ్డల్ని కనేస్థితి) వాళ్ళ బిడ్డలకో, కోడళ్ళకో, అక్కలకో వస్తే!!! ఎవరికీ తెలీకుండా ఈ పనే— ఈ 'సంస్కరణ' కంఠాలన్నీ చేసేది.

నాకు అక్కడ నుంచో బుద్దవలేదు. ఆఫీసు వేపు దారి తీశాను.

ఆ తల్లి నిజంగా ఎంత బాధ పడిందో— అక్కడ నుంచున్న జనానికి ఎవరికీ అక్కర్లేదు. బిడ్డకోసం- బిడ్డకి స్తన్యమివ్వాలనే ఆరాటంతో ఎంత కుమిలి పోతోందో.

కనీసం చనిపోయిన బిడ్డని కళ్ళారా చూస్తూ రోదించే హక్కయినా లేదా— ఆ అభాగ్యపు తల్లికి? ఎంత అక్రమ సంతానవతి అయినా!

అప్పుడనిపించింది నాకు— ఆ గాడిద తల్లి నిజంగా ఎంతో అదృష్ట వంతురాలని. దానికి కనీసం చనిపోయిన పిల్లని తన ముందుంచుకుని బాధ పడే స్వాతంత్రమయినా ఉందని.

'చూసేవా మీ వాళ్ళ (మానవుల) స్థితి' అంటూ ప్రశ్నిస్తోన్నట్టు ఓ గాడిద హైస్కూలు గేటుకు అడ్డంగా నిలబడి నావేపు చూస్తూ ఉంది.

సిగ్గుగా ఫీలయ్యాను. ఎంతయినా మనిషిని. అభిమాన ధనం కలవాడిని 'మైడియర్ డాంకీ ! మేమంటే ఎవరను కున్నావు? పరిణామ క్రమంలో మీ జంతువుల కన్నా ఎదిగిన వాళ్ళం. నవ్వగల వాళ్ళం- ఏడవగల వాళ్ళం (ఏడ్పించగల వాళ్ళం) నిటారుగా రెండుకాళ్ళ మీద నడవగల వాళ్ళం- అంతే కాదు ఆలోచించగల వాళ్ళం- సంఘజీవులం.... కట్టుబాట్లుగల వాళ్ళం- మేం మనుషులం.... మేం మనుషులని తెలుసునా" సమర్థించు కున్నాను నాలో నేను.

*

(28 - 6 - 1980 ఆనంద జ్యోతి వారపత్రిక)